క్లుప్తంగా

విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ

భట్టిప్రోలు: భట్టిప్రోలులో స్వామి వివేకానంద విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బౌద్ధ స్థూపం సమీపంలో స్వామి వివేకానంద, సుభాష్‌చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు విగ్రహాల ఏర్పాటుకు బుధవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు బందారు కుమారి, గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయిలు పాల్గొన్నారు. భూమి పూజా కార్యక్రమాన్ని యునెస్కో వాస్తు పండిట్ బ్రహ్మశ్రీ వంగర చలమయ్య సిద్ధాంతిచే శాస్త్రయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బూర్లె రామ ప్రసాద్, విగ్రహ సాధన కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు, చిదంబరరావు, శనగపల్లి శ్రీనివాస ప్రసాదగుప్తా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 23వతేదీ గురువారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టణంలోని రాజేష్ థియేటర్ సెంటరు, హౌసింగ్ బోర్డు కాలనీ, ఓల్డ్ స్టేట్ బ్యాంక్ రోడ్డు, రాజశ్రీ వక్కపాడి రోడ్డు, పండ్ల మార్కెట్ నుంచి లక్ష్మీ టాకీసు సెంటరు వరకు మెయిన్ రోడ్డుకు ఇరువైపుల విద్యుత్ నిలుపుదల అవుతుందని ఆశాఖ ఏఈ ఏడుకొండలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

26న తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు

రేపల్లె: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడాప్రాంగణంలో ఈ నెల 26వతేదీ న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ వారిచే ఆదివారం ఉమ్మడి గుంటూరు జిల్లా తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నామని డిస్ట్రిక్ట్ తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ కె.జగన్‌మోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌జూనియర్ (అండర్-12), క్యాడెట్ (అండర్-14) విభాగాలలో క్రీడాకారులకు ఈ తైక్వాండో పోటీలు నిర్వహిస్తారని, ఆసక్తి కలిగిన ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన తైక్వాండో క్రీడాకారులు పోటీలలో పాల్గొనాలన్నారు. పోటీలలో ప్రథమ స్థానం పొందిన క్రీడాకారులు మార్చి 10 నుంచి విశాఖపట్నంలోని యలమంచిలిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనవచ్చన్నారు.

రేపు అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

నిజాంపట్నం: అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం ఈనెల 24వ తేదీ వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు యార్లగడ్డ మదన్‌మోహన్ తెలిపారు. మండలంలోని అడవులదీవిలో ఈనెల 24వ తేదీ జరగనున్న విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు దంపతులు, రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పాల్గొంటారని తెలిపారు. అదేవిధంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

మద్యం అక్రమ విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సంఘటన పట్టణంలోని ఇసుకపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌చార్జి సెబ్ సీఐ డి.శ్రీనివాస్ వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో ఇసుకపల్లిలో దాడులు నిర్వహించగా కృష్ణా జిల్లా నాగాయలంక మండలం ఈలచెట్లదిబ్బ గ్రామానికి చెందిన బడుగు సాంబశివరావు అనే వ్యక్తి మద్యంను విక్రయిస్తు పట్టబడ్డాడన్నారు. అతని వద్ద నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరిచినట్లు చెప్పారు.

భగవాన్ వెంకటేశ్వరస్వామి ఆశ్రమ వార్షికోత్సవం

తెనాలి టౌన్: సంగంజాగర్లమూడిలోని భగవాన్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆశ్రమంలో బుధవారం 19వ వార్షిక మహోత్సవాన్ని నిర్వహించారు. గంగాధరస్వామి ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, పూజలు చేశారు. వేడుకల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని పూజలు జరిపారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు జంపాల గోపాలరావు, దివ్యజ్యోతి, అనిరుధ్, సమన్వయకర్తలు కొత్తపల్లి వెంకయ్యబాబు, సువర్ణ శివకుమారి, సభ్యులు పాల్గొన్నారు.

టెండర్లలో పాల్గొనడానికి 28 వరకు గడువు

తెనాలి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపో, కొల్లివర బస్టాండ్ పరిధిలోని పలు షాపుల్ని అద్దెకు ఇచ్చేందుకు టెండర్లను పిలిచినట్లు తెనాలి డిపో మేనేజర్ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ల అప్లికేషన్లు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనదలచిన వారు ఈనెల 28వ తేదీలోపు తమ అప్లికేషన్లను గుంటూరులోని రీజినల్ మేనేజర్ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. వివరాలకు 7382937026, 7382892492 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

వీడనున్న రహదారిద్య్రం



రోడ్డు అంచుల విస్తరణ పనులు చేస్తున్న దృశ్యం

కొల్లూరు: దశాబ్దాల తరబడి నిర్మాణానికి నోచుకోని క్రాప రహదారి నిర్మాణ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తెనాలి-రేపల్లె ప్రధాన రహదారి నుంచి క్రాప వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు 25 ఏళ్లగా నిర్మాణానికి నోచుకోకపోవడం కారణంగా ప్రజలు, రైతులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున రహదారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశారు. రూ.2 కోట్ల అంచనా వ్యయంతో రహదారి నిర్మాణానికి ఆమోదం లభించడంతో రోడ్డు నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. రహదారి నిర్మాణ పనులు ప్రారంభమవడంతో ఏళ్ల తరబడి ప్రయాణ కష్టాలు ఎదుర్కొంటున్న క్రాప వాసులలో హర్షం వ్యక్తమవుతుంది.

అయ్యో.. ఎలా జరిగింది?

'అగ్ని' బాధితులను పరామర్శించి ఆర్థికసాయం అందించిన ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): పిట్టలవానిపాలెం మండలంలోని కొత్తపాలెం గ్రామంలో మంగళవారం గ్యాస్ లీకై గుండుబోయిన వీరారెడ్డి పూరిగృహం దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోన రఘుపతి బుధవారం కొత్తపాలెం గ్రామం వెళ్లి బాధితులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని చెప్పి రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.



కొత్తపాలెంలో దగ్ధమైన గృహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కోన రఘుపతి

శిలువే.. మా శరణాయనుగా..

క్రీస్తు శిలువ ధ్యానములు ప్రారంభం



భట్టిప్రోలు క్రీస్తు లూథరన్ దేవాలయంలో ప్రార్థనలలో పాల్గొన్న క్రైస్తవులు

భట్టిప్రోలు: మానవాళిని రక్షణ కోసం ఏసుక్రీస్తు చేసిన ప్రాణత్యాగాన్ని స్మరించుకుంటూ క్రైస్తవులు ప్రతి ఏటా నిర్వహించే మండల కాల ఉపవాస దీక్ష ప్రార్థనలు (క్రీస్తు శిలువ శ్రమానుభవ ధ్యానములు) బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. భట్టిప్రోలులోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో 40 రోజుల ఉపవాస దీక్షా ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. గురు మండల అధ్యక్షుడు రెవరెండ్ దాసరి రవీంద్రవర్మ మాట్లాడుతూ ఈ ఉపవాస కూడికలు ఈస్టర్ పర్వదినం వరకు కొనసాగుతాయని తెలిపారు. ఈ ఆరాధనలో భాగంగా ఏసుక్రీస్తు మానవాళి కోసం శిలువపై చేసిన ప్రాణ త్యాగాన్ని మననం చేసుకుంటూ, పాప క్షమాపణ పొందాలని ప్రార్థనలు నిర్వహించారు. ఈ ధ్యానాలు ఏప్రిల్ 7వరకు కొనసాగుతాయని రెవరెండ్ రవీంద్రవర్మ తెలిపారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం మళ్లీ జగనే సీఎం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున, పక్కన నియోజకవర్గ పరిశీలకుడు మోహన్‌రావు

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- భట్టిప్రోలులో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో భేటీ

భట్టిప్రోలు: భావితరాల కోసం ముందుచూపుతో నిరంతరం శ్రమిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున కోరారు. భట్టిప్రోలులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. సూరేపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు (చినబుజ్జి) అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి నాగార్జున మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో మళ్లీ తిరిగి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలను తన వైపుచూసే విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను గూర్చి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత గృహ సారథులపై ఎంతగానో ఉందని అన్నారు. వేమూరు నియోజకవర్గ పరిశీలకులు, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లాపల్లి మోహన్‌రావు మాట్లాడుతూ ఎల్లో మీడియా ప్రతిపక్షాలపై చేస్తున్న అసత్యాలను, ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందచేస్తున్న పథకాలను గూర్చి, ఇంటింటికి తిరిగే సమయంలో ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, గ్రామ సర్పంచి దారా రవికిరణ్మయి, అగ్నికుల క్షత్రియ, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్లు శేరు శ్రీనివాసరావు, పడమట శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి , గ్రామ ఉప సర్పంచ్ బూర్లె రామ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు



మండల సర్వసభ్య సమావేశంలో అధికారులతో చర్చిస్తున్న ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల

నిజాంపట్నం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల మాట్లాడుతూ విధి నిర్వహణపై అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సూచించారు. వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలతో పనిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టవల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికలను, తీర్మానాలను చదివి వినిపించారు. గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తెలిపారు. అదేవిధంగా మండలంలో నెలకొన్న సమస్యలను పలువురు ప్రజాప్రతినిధులు వివరించడంతో వాటి పరిష్కారానికి కృషిచేయాలని అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మోపిదేవి హరనాథబాబు, ఎంపీడీఓ నాగలక్ష్మి, డీటీ ఇక్బాల్, ఎంఈఓ హరిబాబు, ఈఓపీఆర్డీ ఉషారాణి, మండల వైస్ ఎంపీపీలు తోటకూర సుబ్బారావు, ఉన్నవ వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ నాజర్‌ఖాన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ జీవితం ఆదర్శనీయం

వ్యవసాయ వర్సిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు



ఉయ్యాలవాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, అధ్యాపకులు

బాపట్ల: ఆత్మాభిమానానికి నిలువెత్తు నిదర్శనం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని, బ్రిటిష్ సామ్రాజ్య గుత్తాధిపత్యాన్ని ఎదిరించి నాటి సమాజానికి ఆదర్శనీయుడయ్యారని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.వి.శ్రీనివాసరావు అన్నారు. వ్యవసాయ కళాశాలలో జరిగిన స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బ్రిటిష్ సైన్యం రాయలసీమ ప్రాంతాన్ని దురాక్రమణ చేసి బలవంతపు కప్పాన్ని విధిస్తే అందుకు నిరాకరించి దొర సుబ్బయ్య, గోసాయి వెంకన్న మొదలగు వీరుల సహాయంతో బ్రిటిష్ వారిని నరసింహారెడ్డి గడగడ లాడించాడని తెలిపారు. సైనిక కార్యకలాపాలు నిర్వహించి, ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి 1846లోనే బీజం పోశాడన్నారు. 1847 ఫిబ్రవరి 22వ తేదీన వీరమరణం పొందాడన్నారు. తన ప్రాణాలను సైతం ఫణంగాపెట్టి ఎదురునిలిచిన నరసింహారెడ్డి వీర మరణం భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రత్నకుమారి, డా.కేఎస్ శ్రీనివాసులు, డా.పులి మోహన రావు, డా. కేఎస్ రవి కుమార్, డా.కె.చంద్రశేఖర్, డా. సి.సంధ్య రాణి, టి.సత్యనారాయణ బోధన మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొని ఘన నివాళి అర్పించారు.

చిరస్మరణీయుడు 'మిక్కిలినేని'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రామారావు

తెనాలి అర్బన్: నటుడిగా ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడిగా మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి నిలచిపోయారని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు పేర్కొన్నారు. అభ్యుదయ కళాసమితి, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ హాలులో బుధవారం సాయంత్రం ప్రజానాట్యమండలి ప్రముఖుడు రాధాకృష్ణమూర్తి వర్ధంతి సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కళారంగానికి రాధాకృష్ణమూర్తి ఊపిరిలందించిన వ్యక్తిగా కొనియాడారు. ప్రజానాట్యమండలి వ్యవస్థాపక సభ్యుడిగా సంస్థ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, టి.వి.వెంకట్, సీహెచ్. శ్రీదేవి, తోట నాగేశ్వరరావు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

తెనాలిలో బాబూజీ సినిమా చిత్రీకరణ



తెనాలిఅర్బన్: బాబూజీ చిత్రానికి సంబంధించిన పలు సన్నివేశాలను ముంబాయికి చెందిన నటి కావ్యపై బుధవారం తెనాలిలోని రత్న ఫార్చ్యూన్ కన్వెన్షన్‌లో దర్శకుడు దిలీప్‌రాజా చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ల కిందట జరిగిన పలు సంఘటనలు తెరపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్వాతంత్ర్యం రాకముందు ఉపయోగించిన కరెన్సీ, భగత్ సింగ్ వాడిన సైకిల్, గాంధీజీ చెప్పులు, పాలకులు ప్రయాణించిన కారులు, బ్రిటిష్ వైస్రాయ్ ఉపయోగించిన తుపాకీలను తమ కళా దర్శకుడి సారథ్యంలో రూపొందుతున్నాయని చెప్పారు. సినిమా కథనంలో స్వాతంత్ర్య ఉద్యమం హైలెట్‌గా ఉంటుందన్నారు. ఇందులో సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, సర్దార్ వల్లభాయ్ పటేల్, బాబురాజేంద్రప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ, జగజ్జీవన్‌రామ్ తండ్రి శోభిరామ్ పాత్రలు కీలంగా ఉండనున్నట్లు చెప్పారు.

రిక్షా బండ్లు పంపిణీ

తెనాలి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం తెనాలిలో చెత్త ఏరుకునే వారికి ఉచితంగా రిక్షా బండ్లను పంపిణీ చేశారు. రిసోర్స్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అల్లాడి దేవకుమార్ వీటిని పంపిణీ చేశారు. చెత్తను ఏరుకుని జీవించే కుటుంబాల (వేస్ట్ పికర్స్)కు రిక్షాబండ్ల పంపిణీ తోడ్పడుతుందని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రోగ్రాం మేనేజరు సీహెచ్. సామ్యూల్ అనిల్‌కుమార్, ఫైనాన్స్ మేనేజరు నాగలక్ష్మి, రీసోర్స్ కో-ఆర్డినేటర్లు ప్రవీణ్, విశ్వ, రవితేజ, రమేష్ పాల్గొన్నారు.

మహాప్రస్థానంలో శివుడి విగ్రహ ప్రతిష్ట

తెనాలి టౌన్ : రూరల్ మండలం కొలకలూరు శివారు ఖాజీపేటలోని హిందూ మహాప్రస్థానంలో బుధవారం మహా శివుడి విగ్రహాన్ని ప్రతిష్టించారు. రూ. 5 లక్షలతో ఏడు అడుగులు, మూడు టన్నుల బరువు గల విగ్రహాన్ని చిలకలూరిపేటలో తయారు చేయించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి కనక తప్పెట్లు, టపాసులు కాలుస్తూ గ్రామంలో ఊరేగించారు. మహిళలు విగ్రహానికి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం మహాప్రస్థానంలో అర్చకులు ప్రతిష్టించారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత



ఎమ్మెల్యే కోన రఘుపతిని సన్మానిస్తున్న బీసీ సంఘాల నాయకులు

బాపట్ల: బీసీ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని బాపట్ల మార్కెట్‌యార్డు చైర్మన్ గవిని కృష్ణమూర్తి పేర్కొన్నారు. రాజ్యసభ, ఎమ్మెల్సీ స్థానాల్లో 60శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించటంతో వైఎస్సార్ సీపీకి చెందిన ఆయా సామాజిక వర్గానికి చెందిన అందరం రుణపడి ఉంటామంటూ పేర్కొన్నారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి నివాసంలో బుధవారం బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు పార్టీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ కోనను సన్మానించారు. ఈసందర్భంగా మార్కెట్‌యార్డు చైర్మన్ గవిని కృష్ణమూర్తి మాట్లాడుతూ సామాజిక న్యాయం అంటూ మైకులు పగిలేలా మాట్లాడే నాయకులు ఎవరు బీసీ, ఎస్సీ, ఎస్టీల గురించి పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన దగ్గర నుంచి నామినేటెడ్ పదవుల దగ్గర నుంచి పనుల వరకు అన్నింటిలో సామాజిక న్యాయాన్ని ప్రత్యక్షంగా చూపించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికి మేమంతా రుణపడి ఉంటామని తెలిపారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన పాలన అందించటమే ప్రధానలక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకుపోతున్నారని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం దక్కుతుందని తెలిపారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ నర్రా వెంకట్రావు, యెనుమల భాస్కర్‌గౌడ్, మత్స్య కార్పొరేషన్ డైరెక్టర్లు కన్నా మామిడియ్య, కొక్కిలిగడ్డ చెంచయ్య, పీటా రాములు, గొర్ల శ్రీనివాసరావు, నిరంజన్, జోగి రాజా, ఇనగలూరి మాల్యాద్రి తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి అబుల్‌కలాం ఆజాద్ కృషి



అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

బాపట్ల అర్బన్: భారత దేశ లౌకికత్వానికి ప్రతీక ప్రముఖ జాతీయతా వాది అబుల్ కలాం ఆజాద్ అని సప్తస్వర సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కె.కోటిరాజ్ అన్నారు. సప్తస్వర సంగీత కళాశాల ఆధ్వర్యంలో బుధవారం అబుల్‌కలాం ఆజాద్ వర్ధంతి సభ నిర్వహించారు. సభకు కోటిరాజ్ అధ్యక్షత వహించారు. సభకు ముఖ్య అతిథిగా రావూరి నరసింహవర్మ పాల్గొన్నారు. వర్మ మాట్లాడుతూ ఆజాద్ నిర్బంధ ప్రాథమిక విద్య, స్త్రీ విద్యను ప్రోత్సహించారన్నారు. దేశంలో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ముందుగా అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మర్రి మాల్యాద్రి, ఆదం షఫీ, అల్లూరమ్మ, కస్తూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల అర్బన్: భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ ఆదర్శనీయులని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట అంజిబాబు అన్నారు. అంజుమన్ కమిటీ కార్యాలయంలో బుధవారం గంట అంజిబాబు ఆధ్వర్యంలో మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాది జెడ్.బాషా, కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు పఠాన్ రాజేష్, నక్కల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీవారిపాలెంలో పశువైద్య శిబిరం



పశువులకు అవసమైన మందులను పశు యజమానులకు అందజేస్తున్న సర్పంచి వడ్డీ సునీత

రేపల్లె రూరల్: మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను పశుయజమానులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి వడ్డీ సునీత అన్నారు. మండలంలోని వడ్డీవారిపాలెం గ్రామంలోని సచివాలయ కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన ఉచిత పశువైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మానవులకు ఎంతో మేలు చేసే మూగజీవాలను మానవజాతి పరిరక్షించాలన్నారు. పశువైద్యులు ప్రవీణ్‌కుమార్, మీనాక్షిలు 127 గేదెలు, దూడలు, 50 గొర్రెలు, 350 కోళ్లకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన మందులను పశుయజమానులకు అందించారు. కార్యక్రమంలో నాయకులు వడ్డీ శ్రీనివాస్, పాలకేంద్రం అధ్యక్షుడు చంటి, ఏహెచ్‌ఏలు వినోద్‌కుమార్, వెంకట వర్మ, బాల ఆంజనేయులు, గోపాలమిత్రలు దేవర్ధన్, శివకృష్ణ, పశుపోషకులు పాల్గొన్నారు.

యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కర్లపాలెం: రాష్ట్రంలో యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర యానాది హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిరువీధుల శంకర్ ప్రసాద్ బుధవారం ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో 12లక్షల జనాభా ఉన్న యానాదులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆయన అన్నారు. ప్రకటన చేసిన వారిలో యానాది గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగా శ్రీనివాసరావు, నాయకులు రావూరి కోటేశ్వరమ్మ తదితరులు ఉన్నారు.

బేతపూడిలో కార్డన్ సెర్చ్

- 500 లీటర్ల బెల్లంఊట ధ్వంసం
- 10 కిలోల నల్లబెల్లం స్వాధీనం



కార్డన్ సెర్చ్‌లో స్వాధీనం చేసుకున్న నాటుసారా డ్రమ్ములు

బాపట్లటౌన్: నాటుసారా తయారుచేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని 70 మంది పోలీసులు బుధవారం బాపట్ల మండలంలోని బేతపూడి గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. దానిలో భాగంగా బేతపూడి గ్రామంలోని ప్రతి ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. దాడుల్లో 2 లీటర్ల నాటుసారా, 10 కేజీల నల్లబెల్లం, 2 కేజీల సూపర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్డన్ సెర్చ్‌లో నాలుగు 100 లీటర్ల ప్లాస్టిక్ డ్రమ్ముల్లో, రెండు 50 లీటర్ల ప్లాస్టిక్ డ్రమ్ములలో నాటు సారాయి తయారీకి పులియబెట్టిన సుమారు 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. వీటితో పాటు 2 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ నాటుసారా తాగడం వలన అనేక రకాలైన అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కొన్ని సందర్భాల్లో మరణం కూడా సంభవించే అవకాశం ఉందన్నారు. నాటుసారా తయారీ, క్రయ, విక్రయాలకు పాల్పడినవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తరచు నాటుసారా తయారీ క్రయ, విక్రయాలకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ అమలు పరుస్తున్నామని, అవసరమైతే జిల్లా బహిష్కరణ విధించడానికి కూడా వెనుకాడబోమన్నారు. దాడులు నిర్వహించిన వారిలో బాపట్ల డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, సీఐ జి.వేణుగోపాలరెడ్డి, ఎస్ఐలు కె. వెంకటప్రసాద్, నాగశ్రీను పాల్గొన్నారు.